# హాత్ అంటే?

ఇంటి గోడమీద కాకి వాలింది.

"హాత్" అని అదిలించి, కాకిని తరిమింది ఇంటావిడ.

"అమ్మా, హాత్ అంటే ఏమిటే?" అని అడిగింది ఆవిడ నాలుగేళ్ళ కుమార్తె.

చిన్నపిల్ల చిట్టి ప్రశ్నకి గోముగా చూస్తూ ముచ్చటగా చిరునవ్వు నవ్విందావిడ!

తను ఇంటికి చేరీచేరడంలోనే అవిడెందుకలా నవ్విందా? అని క్వశ్చన్ మార్కు ముఖంపెట్టి గాభరాగా ఇంట్లో అడుగుపెట్టేడాయన.

ఎత్తివేసిన కాలు ఎంగిలాకులో పడింది!

"ఏం నాయనా అలా ఉన్నావు? ఒంట్లో బాగోలేదా?" అంది అమ్మ.

"ఆఁ ఆఁ ఒంట్లో బాగాలేదు," అని సర్దుకున్నాడాయన.

తరువాత చాలా విచారించేడాయన-'తను ఎందుకలా అబద్ధమాడేడా?' అని. ఆరోజు తనకి ఒంట్లో బాగులేకపోవడమంటూ లేదు. పైగా కాస్త హుషారుగానే ఉంది. ఎప్పుడూ రుసబుస లాడుతుండే ఆఫీసరు ఎంతో ఆదరంగా పిల్చి మాట్లాడేడారోజు. కాకపోతే, కాస్త పని ఎక్కువ చెప్పి ఉండవచ్చు.

రోజూ పదిసార్లు పిలచినా పలకని ఆఫీసు బంట్రోతు "బాబూ, కాఫీ తీసుకురానా?" అని ముందుగానే అడిగేడారోజు.

మరి తనఒంట్లో బాగులేదని అమ్మతో అబద్ధం చెప్పిందెందుకో!

ఇంటావిడ చిరునవ్వు నవ్వితే అందులో తాను గాభరాపడాల్సిందేముంది? అసలు ఆవిడ కాపురానికొచ్చిన దగ్గరనుంచి తాను కోరుతున్నదదేగా?... "ఆఫీసునుంచి తాను వచ్చేసరికి ఆమె చక్కగా శృంగారించుకొని చిరునవ్వు నవ్వుతూ ఎదురురావాలని." అయినా, ఆమె మరొక్కసారి నవ్వితే బాగుండును. ఈసారినవ్వితే ఆనవ్వులో అంతరార్థం తను గ్రహించగలడు.

*　　*　　*

"ఏమండీ?"

"......"

"మాట్లాడరేమండీ?"

"......"

"ఒంట్లో బాగాలేదా?"

"......"

ఈసారి సూటిగా ఆమె ముఖంలోకి చూశాడాయన.

చిరునవ్వుకి బదులు ఆమె ముఖంలో ఎంతో దుఃఖం గూడుకట్టుకు కనిపిస్తోంది. 'ఇంక ఏడ్చేస్తాం' అన్నట్లు పెదిమలు వణుకుతున్నాయి. కళ్ళనిండా నీళ్లు తిరుగుతున్నయి.

"...ఆ కాస్త వంట్లో చికాకుగానే ఉంది". అన్నాడాయన, మళ్లీ కేవలం అనుకోకుండానే.

## పంతుల సావిత్రి

"ఎందుకేనా మంచిద"ని పొరుగింటి అబ్బాయి ద్వారా డాక్టరుకి కబురంపించిందాయన తల్లి.

తీరా, డాక్టరు వచ్చేసరికి తను ఏమీ లేదంటే లోగుట్టు బయిటికొస్తుందేమోనని దుప్పటి మరికాస్త ఘట్టిగా బిగించి, పెద్దగా మూలుగారంభించేడాయన.

"మరేం ఫర్వాలేదు. ఇప్పటికో ఇంజక్షనిచ్చి, నాలుగు మోతాదులు మందు పంపిస్తాను. ప్రతి నాలుగ్గంటలకి ఒక మోతాదివ్వండి. మళ్ళీ ఉదయం వచ్చి చూస్తా" అని చెప్పి తన పని నిర్వర్తించుకొని వెళ్లాడు డాక్టరుగారు.

ఇదంతా ఏమిటో బోధపడక ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారంతా!

"నాన్నా.....'హాత్' అంటే ఏమిటి నాన్నా" మళ్ళా అడిగింది కూతురు.

చిన్నపిల్ల చిట్టి ప్రశ్నకి జవాబు చెప్పలేక గోముగా ఒక చిరునవ్వు నవ్వేడాయన.

"ఓహో...ఆహాఁ... తెలిసింది.... తెలిసింది..." అనుకుంటూ అవ్వగారిదగ్గరికి పరిగెట్టిందా అమ్మాయి.

"ఏమిటే తెలిసింది?" అంది అవ్వగారు.

"అవ్వా! హాత్ అంటే ఏమిటవ్వా?" మళ్ళీ అడిగింది అమ్మాయి.

"హాత్ అంటే..." అవ్వగారికి కూడా తెలీదు జబాబు, "నువ్వు చెప్పవే", అంది అవ్వగారు.

"హాత్ అంటే...అంటే...మరోచ్చీ... ఇది" అంటూ చిన్న చిరునవ్వు నవ్వింది అమ్మాయి.

"నిజంగానే అవ్వా, 'హాత్' అంటే ఇదే" అంటూ మళ్ళీ నవ్విందమ్మాయి.

"నాకు అమ్మ చెప్పింది. కావలిస్తే నాన్ననడుగు. నాన్నకూడా అదే చెప్పాడు..."

అమ్మాయి మాటలువిని అంతా ఒక్కసారే నవ్వారు. అంతా ఎందుకు నవ్వారో గాని ఆయనమాత్రం 'ఇప్పటికంతా స్పష్టంగా అర్థమైంది' అన్నట్లు ఎంతో సంతోషంగా నవ్వాడు. ★




PSHC.26